క్లుప్తంగా

పలు పాఠశాలలకు సైన్స్ ల్యాబ్ మెటీరియల్ పంపిణీ



ఎల్లారెడ్డి: మండలంలోని పలు పాఠశాలలకు ఎంఈవో రాజులు బుధవారం సైన్స్ ల్యాబ్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. మండలంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, మత్తమాల, గండిమాసానిపేట, వెల్లుట్ల జెడ్పీ పాఠశాలలు, మోడల్‌స్కూల్‌కు వచ్చినటు వంటి సైన్స్ ల్యాబ్ మెటీరియల్‌ను అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, సీఆర్‌పీలు మహిపాల్, మహేష్ తదితరులున్నారు.

వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి



బాన్సువాడ రూరల్: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారాలు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరు తప్పకుండా ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలని కార్యాలయ అధికారి తుల శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశానుసారం బుధవారం ఆయన బాన్సువాడలోని పలు వ్యాపారులను కలిసి ట్రేడ్ లైసెన్స్‌లపై అవగాహన కల్పించారు. పాతవారు తప్పకుండా రెన్యూవల్ చేసుకోవాలన్నారు. కొత్తగా కావాలనుకునే వారు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అధికారులు బాలరాజ్, తోట రవి, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వనమహోత్సవం



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలను విరివిగా నాటారు. దోమకొండ ఎక్సైజ్ సీఐ మధుసూదన్, ఎస్సై సబిత, పంచాయతీ కార్యదర్శి గుడిసె బాబు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సార్గు నరేష్ కాంగ్రెస్ నేతలు సత్యం, ప్రకాశ్‌గౌడ్, అమీన్, ప్రవీణ్‌గౌడ్,కార్తీక్, రమేష్, మాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్‌లు పాల్గొన్నారు.

మార వారి గుడాడి రెడ్డి సంఘం నూతన కార్యవర్గం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో బుధవారం మారవారి గుడాడి రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మార నవీన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మార తిరుపతి రెడ్డి, కార్యదర్శులుగా మార రఘుపతి రెడ్డి, మార రాజిరెడ్డి, కోశాధికారులుగా మార బాల్ రెడ్డి, మార సుధాకర్ రెడ్డి, డైరెక్టర్‌లుగా శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి, బాల్‌రెడ్డి, సంఘం సామగ్రి ఇన్‌చార్జిగా బాల్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్ట్‌ల వితరణ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని జప్తిజాన్కంపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం మాజీ సర్పంచ్ దేశబోయిన సాయిలు టై, బెల్ట్‌లను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని క్రమశిక్షణతో ఉండాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం అనసూయ, తాండూర్ సొసైటీ వైస్ చైర్మన్ బాబురావు, జీపీకార్యదర్శి శంకర్, మాజీ సర్పంచ్ లక్ష్మాగౌడ్, నాయకులు దేవిసింగ్, సురేందర్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

తాడ్వాయి (ఎల్లారెడ్డి): ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని పాదదర్శకంగా ఇళ్లను నిర్మించుకోవాలని అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంతో పాటు కృష్ణాజీవాడి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ పరిశీలించారు. లబ్ధిదారులు తమ ఇళ్లను త్వరగా నిర్మించుకున్నట్లయితే డబ్బులు చెల్లించడం జరుగుతుందన్నారు. గ్రామంలో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యదర్శులు బాలు, చంద్రకళ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

భూమిపూజకే పరిమితమా...?

- బీబీపేట బాలికల హైస్కూల్ భవన నిర్మాణానికి మూడేళ్ల క్రితం నిధులు..
- ఇప్పటివరకు ప్రారంభం కాని పనులు
- తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- గదుల నిర్మాణం చేపట్టాలని వినతి



బీబీపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల

బీబీపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల గత ప్రభుత్వ హయాంలో 'మన ఊరు మన బడి' పథకం కింద మొదటి విడతలో ఎంపికైంది. దీంతో శిథిలావస్థలో ఉన్న మూడు గదులను 2022 లో కూల్చివేశారు. రూ. కోటి 30లక్షలతో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి 2022 డిసెంబర్ 17న మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ భూమిపూజ చేశారు. మూడేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీంతో గదుల నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.

ఐదు గదుల్లోనే.. ఆరు తరగతులు

పాఠశాల భవన నిర్మాణ పనులు మొదలు కాకపోవడంతో మిగిలిన ఐదుగదుల్లోనే ఆరు తరగతులను నిర్వహిస్తున్నారు. ఐదు గదుల్లో ఒకటి వర్షానికి పూర్తిగా గదిలోకి నీరు రావడం, మరొక్క గదిలో పైనుంచి పెచ్చులూడుతుండడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గదులు కూల్చివేసిన స్థలంలో పిచ్చి మొక్కలు పెరగడంతో పాఠశాలలో పాములు తిరుగుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాలలో 121 మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని గదుల నిర్మాణం త్వరగా ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నూతన భవన నిర్మాణం చేపట్టాలి



ప్రస్తుతం తరగతి గదులు తక్కువగా ఉండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులు లేవు. నూతన భవన నిర్మాణం చేపట్టాలి. పాఠశాలలో గదులు కూల్చిన స్థలం ఖాళీగా ఉన్నందున విషపురుగులు వస్తున్నాయి.

– స్వామి, విద్యార్థిని తండ్రి

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

గతంలో చేసిన పనులకు నిధులు విడుదల కావడం లేదని గుత్తేదారులు నిర్మాణం చేపట్టడం లేదు. ప్రభుత్వాలు మారడంతో నిధులు విడుదలకు జాప్యం జరుగుతుంది. గదుల నిర్మాణం కోసం కూడా ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ల్యాబ్ కోసం గదుల అవసరం ఉండడంతో పాఠశాల హెచ్‌ఎం మరో గదిని తయారు చేసిన ఇచ్చారు.

– అశోక్, ఎంఈవో, బీబీపేట

సమన్వయం చేసుకొని పని చేయాలి



కామారెడ్డి పెద్ద చెరువు అలుగును పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర, ఏఎస్పీ చైతన్య రెడ్డి

- ఎస్పీ రాజేశ్ చంద్ర
- పలు చోట్ల చెరువుల పరిశీలన

కామారెడ్డి క్రైం/సదాశివనగర్ : భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. బుధవారం ఆయన కామారెడ్డి పెద్ద చెరువు, సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువును పరిసరాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉధృతంగా నీరు ప్రవహించే ప్రదేశాలకు ప్రజలు వెళ్లకూడదన్నారు. 24 గంటల పాటు పోలీస్ సేవలు అందుబాటులో ఉంటాయని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వాగులు, చెరువులు, కుంటల వద్దకు పంపకూడదన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువులు, కుంటల నీటి ప్రవాహం, తీసుకోవాల్సిన చర్యలు, తదితర విషయాల్లో వివిధ శాఖల అధికారులతో పోలీసులు సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. వరద ఉధ్రుతి ఎక్కువ ఉన్న ప్రదేశాల్లో వాహనాల దారి మళ్లింపు చర్యలు చేపట్టాలన్నారు. ఎవరైనా సమస్యల్లో ఉంటే డయల్ 100,, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 08468-220069 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ చైతన్య రెడ్డి, రూరల్ సీఐ రామన్, ఎస్బీ సీఐ శ్రీధర్, సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సైలు పుష్పరాజ్, రంజిత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పొల్కంపేట, జగదాంబ తండా, సురాయిపల్లి, కన్నాపూర్ తదితర గ్రామాల శివారులో లోతట్టు ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. వంట గది, స్టోర్ రూమ్, ఒకేషనల్ రూమ్, సివిల్ వర్క్‌లను పరిశీలించారు.

చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై భార్గవ్ గౌడ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): విద్యార్థులు సన్మార్గంలో బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్సై భార్గవ్ గౌడ్ సూచించారు. నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు ఆకర్షితులు కావొద్దని సూచించారు. ఉద్యోగానికి సంసిద్ధులు కావాలనుకునే విద్యార్థులు తనను సంప్రదిస్తే తగిన విధంగా గైడ్ చేస్తానని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, గోపాల్‌పేట్ హైస్కూల్ హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి, నాయకులు మురళీగౌడ్, మురళీ, కళాశాల అధ్యాపకులు రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు నోట్ పుస్తకాలు అందిస్తున్న ఎస్సై రాఘవేంద్ర

విద్యార్థులకు నోట్ బుక్కుల పంపిణీ

నస్రుల్లాబాద్: మండలంలోని మైలారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎస్సై రాఘవేంద్ర నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రాసుకోవడానికి ఇబ్బంది పడకూడదని నోట్ బుక్కులను అందించానన్నారు. కానిస్టేబుల్ సాగర్, గ్రామ యువకులు కర్నం భాస్కర్,శివ,వినోద్; నాగరాజు, అజయ్, మహేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

అధికారులు స్థానికంగా అప్రమత్తంగా ఉండాలి

బాన్సువాడ రూరల్/ఎల్లారెడ్డి : భారీవర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో బుధవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి 9 శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని అధికారులు స్థానికంగా అప్రమత్తంగా ఉండి ప్రజలకు భద్రత కల్పించాలని సూచించారు. భారీవర్షాలతో ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయి అధికారులతో ఆర్డీవో పార్థసింహారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.అన్ని శాఖల ఉద్యోగులు హెడ్ క్వార్టర్ మెయింటైన్ చేయాలని అన్నారు. వర్షాల దృష్ట్యా ఆర్డీవో ఆఫీస్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ స్థాయిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరిగిన పౌరులు 9492022475 నంబర్ ని సంప్రదించాలన్నారు. ఈసమావేశంలో డీఎస్పీలు విఠల్‌రెడ్డి, శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమీషనర్లు శ్రీహరిరాజు, మహేష్‌కుమార్, నీటిపారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు, డీఎల్‌పీవో సురేందర్, ఫైర్ ఆఫీసర్ వినోద్, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, ఫైర్‌సేఫ్టీ, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో నివాసం ఉండరాదు

లింగంపేట/ఎల్లారెడ్డిరూరల్/సదాశివనగర్/తాడ్వాయి/మద్నూర్/బీబీపేట/బిచ్కుంద/ గాంధారి/పెద్దకొడప్‌గల్/ నాగిరెడ్డిపేట/పిట్లం/ భిక్కనూరు : భారీ వర్షాలు కురువనున్న నేపథ్యంలో అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని డీఆర్‌డీవో పీడీ సురేందర్ సూచించారు. లింగంపేట ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ సమావేశం నిర్వహించారు. సదాశివనగర్ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామకార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో సతీష్ కుమార్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, గ్రామకార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని మండల ప్రత్యేక అధికారి శివకుమార్ నిర్వహించారు. ఉమ్మడి డోంగ్లీ, మద్నూర్ మండల కేంద్రాల్లో అధికారులు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.బీబీపేట ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బిచ్కుందలో జీపీ కార్యదర్శులు, రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో అధికారులతో మండల ప్రత్యేక అధికారి నగేష్, తహసీల్దార్ వేణుగోపాల్ సమావేశం నిర్వహించారు. గాంధారి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ రేణుకా చౌహాన్, ఎస్సై ఆంజనేయులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. పెద్దకొడప్‌గల్ రైతు వేదికలో తహసీల్దార్ దశరథ్ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. నాగిరెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో మండల ప్రత్యేకాధికారి ఇంద్రసేన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడారు, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో జనాలు నివాసం ఉండకుండా చాటింపు వేయించాలని, అటువంటి వారిని సురక్షిత ప్రదేశంలో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు, సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తినష్టం జరగకుండా సంబంధిత కార్యదర్శులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావొద్దని పిట్లం ఎస్సై వెంకట్‌రావ్ విజ్ఞప్తి చేశారు. భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామంలో డబుల్‌బెడ్‌రూముల్లో నివాసం ఉంటున్న వారిని కలిసి ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి మాట్లాడారు. వర్షాలు అధికంగా కురిస్తే డబుల్‌బెడ్‌రూముల వద్దకు వరద నీరు వస్తోందని ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన వారికి సూచించారు.



సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి

లక్ష్మాపూర్‌లో గోదాం నిర్మాణానికి తీర్మానం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి సొసైటీ పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామంలో గోదాం నిర్మాణానికి తీర్మానం చేసినట్లు సొసైటీ చైర్మన్ నర్సింలు అన్నారు. బుధవారం సొసైటీలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో లింగారెడ్డిపేట సొసైటీ భవనానికి కాంపౌండ్ వాల్ నిర్మాణం చేసేందుకు డైరెక్టర్లు తీర్మానం చేశామన్నారు. అనంతరం లావాదేవీల వివరాలను కార్యదర్శి విశ్వనాథం కార్యవర్గ సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు గోపి, నారాయణ, ప్రకాష్, సుఖేందర్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



భిక్కనూరు: వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్ అన్నారు. బుధవారం భిక్కనూరు ప్రభుత్వాసుపత్రిని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాన్పు ప్రభుత్వాసుపత్రిల్లోనే జరిగేలా చూడాలన్నారు. అలాగే పదిరోజుల్లో ప్రసూతి అయ్యే వారిని భారీ వర్షాల నేపథ్యంలో సురక్షిత ప్రాంతాల్లో ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ప్రభుత్వవైద్యాధికారి యెమిమా, ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణలు ఉన్నారు.

పునరావాసం కల్పించాలి



రాజంపేట: శిథిలావస్థలో ఉన్న ఇళ్ల కుటుంబాలకు పునరావాసం కల్పించాలని కోరుతూ బుధవారం రాజంపేట బీజేపీ శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ జానకీకి వినతిపత్రం అందజేశారు.భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను తక్షణమే పునరవాస కేంద్రాలకు తరలించాలని కోరారు. మండలంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పిట్ల శ్రీను, గుర్రాల రాము, బల్ల కిషోర్, దాగ్గారి నరేష్, వంశీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కోమట్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీవో మలహరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందుతుందా లేదా అని ఆరా తీశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. జగదాంబతండా, సురాయిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇల్లు, పారిశుద్ధ్యం, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు.

మహిళా సాధికారతపై విద్యార్థులకు అవగాహన

కామారెడ్డి అర్బన్: మహిళలు వివక్షకు గురికాకుండా లింగ సమానత్వం, అక్షరాస్యత, ఆర్థిక చైతన్యం సాధించాలని జిల్లా మహిళా సంక్షేమాధికారి ఏ.ప్రమీల అన్నారు. బుధవారం కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం అవగాహన కార్యక్రమం, మహిళలను చైతన్యం చేసే వాల్‌పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. వివిధ అంశాలలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యవేక్షకులు అరుణ్‌భాస్కర్ రావు, కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

వృద్ధుల సంఘాలపై అవగాహన

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వృద్ధుల సంఘాల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న వారికి మహిళ సమాఖ్య రుణాలను అందజేసే విషయాన్ని ప్రజలకు వివరించారు.అన్ని గ్రామాల్లో వృద్ధుల సంఘాలను ఏర్పాటు చేయడంతో వారిని గౌరవించినవారమవుతామని ఏపీఎం సాయిలు వివరించారు. ఆయన వెంట సీసీలు వీవోలు ఉన్నారు.



భిక్కనూరులో అవగాహన కల్పిస్తున్న ఐకేపీ సిబ్బంది

అవయవ దానంపై 'రోటరీ' అవగాహన

కామారెడ్డి అర్బన్: అవయవ దానంతో మరో నలుగురికి ప్రాణదానం చేయవచ్చనే విషయంపై రోటరీ క్లబ్ దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ముస్కు జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం రోటరీ ఆధ్వర్యంలో స్థానిక వీఆర్‌కే జూనియర్ కళాశాలలో ప్రపంచ అవయవదాన దినోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జైపాల్‌రెడ్డి డాక్టర్ గీరెడ్డి రవీందర్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. అవయవ దానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త ఎస్.బాలు విద్యార్థులు, అధ్యాపకులతో అవయవదానంపై ప్రతిజ్ఞ చేయించారు. రోటరీ అధ్యక్షుడు యాచం శంకర్, కార్యదర్శి సబ్బని కృష్ణహరి, ప్రతినిధులు వెంకటరమణ, సుధాకర్, సంతోష్, నవీన్, వీఆర్‌కే ప్రిన్సిపల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రోటరీ అసిస్టెంట్ గవర్నర్ జైపాల్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించాలని వినతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బుధవారం గ్రామస్తులు ఎంపీడీవో నరేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో 20 ఏళ్లుగా తాగునీటి సమస్యతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. గత వారం రోజులుగా వీధి దీపాలు వెలగడంలేదన్నారు. సమస్యలు పరిష్కరించని కార్యదర్శి తమకు వద్దని, వెంటనే బదిలీ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజాగౌడ్, సాయిలు, రాజు, యాదయ్య, మోహన్, నర్సింలు, దుర్గపతి, రాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో నరేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న పర్మళ్ల గ్రామస్తులు

సంక్షిప్తం

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్య సిబ్బంది సూచించారు. బుధవారం మండలంలోని భవానిపేటలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారికి మలేరియా టెస్టులు నిర్వహించారు. సంబంధిత వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ ఫరీధీబేగం, కార్యదర్శి స్రవంతి, సిబ్బంది లక్ష్మణ్, ఏఎన్‌ఎం సునీత, అంజయ్య పాల్గొన్నారు.

బీమా వ్యాపారంలో చీఫ్ అడ్వయిజర్ల కృషి అభినందనీయం

కామారెడ్డి: జీవిత బీమా వ్యాపారం, ఏజెంట్ల నియమాకం, పాలసీదారులకు సేవలు అందించడంలో చీఫ్ లైఫ్ ఇన్సురెన్స్ ఏజెంట్లల (క్లియా) కృషి అభినందనీయమని, క్లియాల ద్వారా దాదాపు 25 శాతం వ్యాపారం రావడమే ప్రాధాన్యతను తెలియజేస్తుందని ఎల్ఐసీ కామారెడ్డి శాఖ మేనేజర్ కృష్ణమోహన్ అన్నారు. క్లియా వెల్ఫేర్ అసోసియేషన్ 15వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి ఎల్ఐసీ శాఖలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేనేజర్ కేక్ కట్ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లియా అధ్యక్షుడు వి.రాజారెడ్డి, సికింద్రాబాద్ డివిజన్ కోశాధికారి ఎం.సంతోష్, ప్రతినిధులు కే.మధుసూదన్ రావు, కుసుమ బాలకిషన్, వి.జయసింహరెడ్డి, కాసర్ల శంకర్, లియాఫీ అధ్యక్షుడు కదం నారాయణరావు, టి.మోహన్, బ్రాంచి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అన్ని గ్రామాల్లో కొత్త గ్రామ సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని ఏపీఎం ప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక రైతువేదిక భవనంలో వీవోల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కిషోర బాలికల సంఘాలు, వికలాంగుల సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు, వివిధ గ్రామాల వీవోలు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో లైబ్రరీ డే వేడుకలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల గురుకుల కళాశాలలో బుధవారం నేషనల్ లైబ్రరీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ అయిన డాక్టర్ ఎస్.ఆర్ రంగనాథన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. రంగనాథన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మీనా, లైబ్రరియన్ కవిత, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల చేయాలి

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లాలోని పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం బిల్లులు రూ.3.50 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.చక్రపాణి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత సంవత్సరం అక్టోబర్ నుంచి కోడిగుడ్ల బిల్లులు, 9, 10 తరగతుల విద్యార్థులకు సంబంధించి భోజన బిల్లులు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు వంద కోట్లకు పైగా ఉన్నాయని చక్రపాణి పేర్కొన్నారు. నిత్యవసర సరుకులు, కోడిగుడ్లు, వంటగ్యాస్‌లను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేస్తు త్వరలోనే ఉద్యమానికి సిద్ధం అవుతున్నట్టు ఆయన తెలిపారు.